

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు..

జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
కడప	: 6.30	5.09
పులివెందుల	: 6.33	5.04
ప్రొద్దుటూరు	: 6.32	5.13

గరిష్టం/కనిష్టం **40.2/24.4**

వాతావరణం

జిల్లాలో బుధవారం 24.4 - 40.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.28 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఈనెల 18 నుంచి 30వ తేది వరకు జరిగే పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు అన్ని పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో తమ నివాసం నుంచి పరీక్షా కేంద్రం వరకు, తిరిగి తమ నివాసం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని జిల్లా ప్రజా రవాణాధికారి పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. కేవలం పరీక్ష జరిగే రోజుల్లో మాత్రమే ఈ ఉచిత ప్రయాణ సౌకర్యానికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని 183 పరీక్షా కేంద్రాల్లో 27,858 మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షలు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వీసీ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రథమ సెమిస్టర్ (రెగ్యులర్) ఆర్కిటెక్చర్ విద్యార్థులకు, 2వ, 3వ, 4వ సెమిస్టర్ పరీక్షలు కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులకు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లో డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటో గ్రఫీ, అప్‌లైడ్ ఆర్ట్స్, యానిమేషన్, స్కల్ప్చర్ విభాగాలకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్టీపీపీ సీఈగా గౌరీపతి



ఎర్రగుంట్ల : డాక్టరు ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌గా గౌరీపతి నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్టీపీపీ సీఈ నాగరాజు విద్యుత్ సౌధ్‌కు బదిలీ అయ్యారు. విజయవాడలోని విద్యుత్‌సౌధ్‌లో జెన్‌కో పరిపాలన విభాగంగా పనిచేస్తున్న గౌరీపతిని ఆర్టీపీపీ సీఈగా నియమించారు. ఈమేరకు ఏపీజెన్‌కో యజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది.

సామాజిక తనిఖీ సర్వే పూర్తి చేయాలి

వైవీయూ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈఓ ఎం.అనూరాధ, ఎస్ఎస్ఏ ఏపీసీ ఎ.ప్రభాకర్‌రెడ్డి కోరారు. సామాజిక తనిఖీ సర్వేను ఈనెల 15లోపు అన్ని ప్రభుత్వ, జెడ్పీ, కేజీబీవీ, గురుకుల, సంక్షేమ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీతో చర్చించి సంబంధిత యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్స్‌తో పాటు, ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారులు కేశవరెడ్డి, దశరథరామిరెడ్డిలను సంప్రదించాలని సూచించారు.

నిబద్ధతతో సేవలు అందించాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ అధికారులు నిబద్ధతతో సేవలు అందించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆర్డీఓలు, తహశీల్దార్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాలులో జేసీ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌లతో కలిసి జిల్లాలోని ఆర్డీఓలు, మండలాల తహశీల్దార్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు నైతిక విలువలను విస్మరిస్తే అధికారం దుర్వినియోగం అవుతుందన్నారు. అధికారాన్ని దుర్వియోగిస్తే దాని పర్యవసానం తీవ్రంగా ఉంటుందని, ప్రజలే అధికారులకు గుణపాఠం చెబుతారన్నారు. అధికార హోదాలో ఎలాంటి రాజకీయాలకు గానీ, డబ్బుకు కానీ తలవంచకూడదని హెచ్చరించారు. అధికారులు అత్యాశ, అక్రమ సంపాదనపై ఆకర్షితులైతే సహించేది లేదని రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

'జపనీస్' అభ్యసనానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జపాన్ దేశంలోని ఆసుపత్రులలో కేర్ టేకర్స్‌గా పనిచేసేందుకు అర్హులైన ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన యువతీ యువకులకు జపనీస్ భాష నేర్పించేందుకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణను బెంగుళూరు నవీస్ హెచ్ఆర్ సెంటర్ లో ఆరు నెలలపాటు అందిస్తున్నామని పేర్కొన్నారు. కోర్స్ ఫీజు రూ.3,50,000లు ఉంటుందన్నారు. దానిలో 25వేలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇస్తుందని, మిగిలిన మూడు లక్షల 25 వేలు శిక్షణ పొందే అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 6 నెలల శిక్షణ అనంతరం జపాన్‌లోని ఆసుపత్రులలో పనిచేయాల్సి ఉంటుం దన్నారు. నెలకు 1,10,000 నుంచి 1,40,000 రూపాయల వరకు జీతం ఇస్తారని ఆయన తెలిపారు. వివరాలకు 9182869733 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

చిరుద్యోగుల చిద్విలాసం

ఇంతకాలం చాలీచాలని జీతాలతో చీకట్లో మగ్గిన చిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖలో అరకొర వేతనాలతో అష్టకష్టాలు పడుతున్న వారి బతుకులు మారుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ తీసుకున్న క్రమబద్ధీకరణ నిర్ణయం వందలాది మంది జీవితాలకు వెలుగు దారులు చూపనుంది.

- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం జగన్ ఉత్తర్వులు
- జీవితాంతం రుణపడి ఉంటామంటున్న ఉద్యోగులు
- చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో 272 మందికి మేలు



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు వైద్య ఉద్యోగులు (ఫైల్)

ఉమ్మడి చిత్తూరు జిల్లా: **152** మంది ఉమ్మడి వైఎస్సార్ జిల్లా: **120** మంది



మదనపల్లె సిటీ: శుభ తరుణం రానే వచ్చింది. కాంట్రాక్టు బతుకులకు వెలుగు తెచ్చింది. రెండు దశాబ్దాల కల నెరవేర్చింది. వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తూ ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్న బడుగు ఉద్యోగుల కల ఫలించింది. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారి ఉద్యోగాలకు భరోసా కల్పించింది. జీఓ 30, జీఓ 31 ద్వారా వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్లు-మేల్, మల్టీ పర్పస్ వర్కర్లు-ఫిమేల్), గ్రేడ్-2 ఫార్మసిస్టుల ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తూ ఇటీవల జారీ చేసిన జీఓలు కాంట్రాక్టు ఉద్యోగులకు ఎనలేని సంతోషాన్ని తెచ్చి పెట్టాయి. ఈ శుభ తరుణం కోసం గత టీడీపీ ప్రభుత్వ హయంలో ఎన్నో పోరాటాలు చేశారు. ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని ఎంతో మందిని కలిశారు. ప్రభుత్వాలు, మారుతున్నా ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరలేదని బాధపడ్డారు. నిరాశ, నిస్పృహలతో ఉన్న ఉద్యోగులకు సీఎం వైఎస్ జగన్ సర్కారు తీపి కబురు తీసుకొచ్చింది. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ జారీ చేసిన జీఓ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది.

- ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీఓ ప్రకారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 152 మంది పర్మినెంట్ అయ్యారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 120 మందిని పర్మినెంట్ చేశారు. ఇటీవల జారీ చేసిన జీఓలతో వీరి ఉద్యోగాలు పర్మినెంట్ అయ్యాయి. తమకు భరోసా ఇస్తూ సీఎం తీసుకున్న నిర్ణయంపై వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు పట్టరాని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జీవితాలకు వెలుగులొచ్చాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయన తీసుకున్న నిర్ణయాన్ని ఉద్యోగులందరూ స్వాగతిస్తున్నారు. మా ఆనందానికి అవధులు లేవు. పాదయాత్రలో ఇచ్చిన మాట ఎక్కడా తప్పలేదు. ఎంతో మంది పాలకులు వచ్చినా మా సమస్యలు ఆలకించలేదు. ఉద్యోగులంతా సీఎంకు రుణపడి ఉంటారు. -జి.చంద్రశేఖర్, ఎంపీహెచ్ఏ, పీహెచ్‌సీ, నిమ్మనపల్లె

కొత్త జీవితాన్ని ప్రసాదించారు



ఇరవై ఏళ్ల నుంచి ఎంతో మంది పాలకులు వచ్చారు. వెళ్లారు. కానీ మా వెతలు తీర్చలేదు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ నెరవేరుతుందా! లేదా! అనే సందేహంలో ఉన్నాం. ఆ హామీని జగనన్న తు.చ తప్పకుండా నెరవేర్చారు. మాకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. -పి.సోమాచారి, పీహెచ్‌సీ, చెంబకూరు,మదనపల్లె మండలం

ఎంతో రుణపడి ఉంటాం



ఎన్నో ఏళ్ల ఎదురు చూపులు ఇంత కాలానికి ఫలించాయి. ఇప్పటి వరకూ ఎన్నో ఇబ్బందులు పడ్డాం. చాలీచాలని జీతంతో పని చేశాం. మా జీవితాలకు ఒక దశ, దిశ నిర్దేశించిన మహానుభావుడు జగన్‌మోహన్‌రెడ్డి. మా కుటుంబం అంతా ఆయనకే తోడుగా నిలుస్తాం. ఉద్యోగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు. ఈ ఆనందాన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు. -ఖాదర్‌బాషా, ఎంపీహెచ్ఏ, పీహెచ్‌సీ, ములకలచెరువు

నిరీక్షణ ఫలించింది



ఇరవై ఏళ్ల నిరీక్షణ సీఎం జగన్ చొరవతో ఫలించింది. మేమంతా పట్టరాని ఆనందంలో ఉన్నాం. జగన్ రుణం తీర్చుకునే అవకాశం కోసం ఆశగా ఎదురు చూస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ఇంకా ఎంతో మంది జీవితాలకు వెలుగులు వస్తాయి. -తేజోమూర్తి, ఎంపీహెచ్ఏ, కందుకూరు

సన్నద్ధం



- ఎన్నికల నిర్వహణకు వేగంగా ఏర్పాట్లు
- అధికార బృందాల నియామకం
- సన్నాహాల్లో నిమగ్నమైన అధికార యంత్రాంగం

కడప సెవెన్‌రోడ్స్: పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ సాధారణ ఎన్నికల నిర్వహణకు అధికారులు సమాయత్తమవుతున్నారు. భారత ఎన్నికల సంఘ అధికారుల పర్యటనలు ఈనెల 13వ తేదితో ముగిశాయి. దీంతో ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు.

ఓటర్ల జాబితా సిద్ధం

2024 జనవరి 1 అర్హత తేదీగా నిర్వహించిన ఫొటో ఓటర్ల నమోదు కార్యక్రమం ముగిసింది. జనవరి 22వ తేదిన ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 16,16,509 మంది ఓటర్లు ఉన్నారు. తుది జాబితా తర్వాత కూడా నమోదు, అభ్యంతరాలు, మార్పులు, సవరణలకు సంబంధించి సుమారు 15 వేల క్లెయిమ్‌లు వచ్చాయి. నామినేషన్ల తుది గడువుకు 10 రోజుల ముందు వరకు క్లెయిమ్‌లు దాఖలు చేసుకునే అవకాశం ఉంది. వీటిని పరిష్కరించే క్రమంలో అధికారులు ఉన్నారు. తుది జాబితా తర్వాత ఓటర్ల సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉంది. ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు (ఎపిక్) కొత్తగా 2,86,681 జనరేట్ చేశారు. ఇందులో 113774 ముద్రించగా, 161199 ప్రాసెస్‌లో ఉన్నాయి.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు

జిల్లాలో ఇప్పటికే 1941 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మరో 22 యాగ్జలరీ పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 1963 కేంద్రాలు ఉన్నాయి. లొకేషన్ మార్చినవి 20 కాగా, పేరు మార్పులు చేసిన కేంద్రాలు 90 ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలను కల్పించారు.

వివిధ టీముల నియామకం

ఎన్నికల ప్రక్రియలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు చాలా కీలకం. ఇప్పటికే ఈఆర్‌ఓలను నియమించారు. షెడ్యూల్ వెలువడిన మరుక్షణం నుంచి వీరే ఆయా నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. జిల్లాలోకి అక్రమ మద్యం, మారణాయుధాలు, నగదు, ఇతర వస్తువులు ప్రవేశించకుండా ఉండేందుకు చెక్‌పోస్టుల వద్ద నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీములు, ఫొటో వీడియో గ్రాఫర్లను నియమించారు. అలాగే సెక్టార్ అధికారులను నియమించారు. 16 మంది నోడల్ అధికారులను నియమించారు.

బందోబస్తు

సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా ఉంచారు. ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా పలువురిని బైండోవర్ చేశారు. జిల్లా పోలీసులతోపాటు కేంద్ర బలగాలు కూడా వస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన బలగాలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి.

సెంచురీ రెండో ప్లాంట్ రెడీ

- నేడు ఉత్పత్తి ప్రారంభం
- మెట్ట రైతులకు వరంగా నిలవనున్న ఫైబోర్డ్స్ సంస్థ
- స్థానికులకు 2076 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు



సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ

సాక్షి ప్రతినిధి, కడప: బద్వేల్ సమీపంలోని సెంచురీ ఫై బోర్డ్స్ సంస్థ గురువారం నుంచి రెండవ దశ ఫ్లాంట్ ఉత్పత్తి ప్రారంభించనుంది. సీఎం వైఎస్ జగన్ సంకల్పం మేరకు నిర్ణయిత గడువు కంటే ముందే ఉత్పత్తి ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా స్థానికులకు ఉద్యోగాలు,మెట్ట ప్రాంత రైతులకు కల్పతరువు దక్కనుంది.

- పారిశ్రామిక ప్రగతికోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కంకణబద్ధులై ఉన్నారు. తొలి రెండేళ్ల కరోనా కారణంగా ఆశించిన వృద్ధి లేకపోయినా.. అవకాశం ఉన్న మేరకు పారిశ్రామిక ప్రగతి సాధించేందుకు తగ్గ ప్రణాళిలు రచించి సక్సెస్ అయ్యారు. పెట్టుబడులను సమకూరుస్తూనే, పారిశ్రామికవేత్తలకు అనువుగా మౌళిక సదుపాయాలు కల్పించారు. అందుకు చక్కటి ఉదాహరణగా గోపవరం సమీపంలో నిర్మించిన సెంచురీ ఫైబోర్డ్స్ సంస్థ నిలుస్తోంది. ఈ సంస్థ నిర్మాణానికి 2021 డిసెంబరు 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. వెంటనే పరిశ్రమకు అవసరమైన మౌళిక సదుపాయాలపై దృష్టి సారించారు. బ్రహ్మంసాగర్ నుంచి 0.07టీఎంసీ నీరు సరఫరాకు అవసరమైన అనుమతులిచ్చి రూ.45కోట్లతో పైపులైన్ 6 నెలల్లో పూర్తి చేశారు. మరో రూ.19.1 కోట్లతో 132కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. సకాలంలో ప్రభుత్వం మౌళిక వసతులు కల్పించడంతో అంతే స్ఫూర్తితో యాజమాన్యం నిర్మాణ వేగాన్ని పెంచింది. దీంతో 2076 మంది స్థానికులకు ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 75 శాతం స్థానికులకు ఇవ్వాల్సి ఉండగా, 78శాతం కల్పించడం విశేషం.

గడువు కంటే ముందే ఉత్పత్తులు...

ఈ పరిశ్రమ కోసం 589.23 ఎకరాల్లో.. రూ.956 కోట్లు అంచనాతో శ్రీకారం చుట్టారు. ఆపై సంస్థ పెట్టుబడులు రూ.1600 కోట్లకు చేరాయి. 2024 డిసెంబర్ నాటికి ఉత్పత్తి లక్ష్యం కాగా, 2023 డిసెంబర్ నాటికే రెండు దశల పనులు కూడా పూర్తి చేశారు. సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభించారు. రెండవ దశ ఫ్లాంట్‌లో తొలి బోర్డ్ ఉత్పత్తిని గురు వారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేశవ బజాంకా అందుకోనున్నారు. కాగా నెలకు 60 ఎకరాల్లోని కర్ర ఈ సంస్థ సేకరించనుంది. తద్వారా సుబాబుల్, జామాయిల్, సర్వి కర్రకు స్థానికంగా పూర్తి డిమాండ్ ఏర్పడనుంది. భవిష్యత్‌లో మెట్ట ప్రాంత రైతులు ఈ పరిశ్రమ వరంగా నిలవనుంది.

రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదములు

సెంచురీ ఫైబోర్డ్స్ సంస్థ నిర్ణయిత గడువు కంటే ముందే రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం మరువలేనిది. మౌళిక వసతులు శరవేగంగా కల్పించారు. పరిశ్రమ ఉత్పత్తి గడువు కంటే ముందే ప్రారంభించాం. స్థానిక, జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. -కేశవ బజాంకా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

వేగంగా నిర్మాణం

సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ పనులు అత్యంత వేగంగా పూర్తి అయ్యాయి. అవసరమైన నీరు, విద్యుత్ సరఫరా పనులను ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా 6నెలలలోపు సమకూర్చింది. చైర్మెన్ సజ్జన్ భజాంకా చొరవతో ఏడాది ముందే పనులు పూర్తి అయ్యాయి. సీఎం చేతుల మీదుగా సంస్థను ప్రారంభించాం. రెండవ దశ ఫ్లాంట్‌లో ఉత్పత్తి గురువారం నుంచి ప్రారంభం కానుంది. -రమేష్‌కుమార్‌రెడ్డి, జీఎం, సెంచురీ ఫైబోర్డ్స్

నిరుపేద మహిళకు నేస్తం

వైఎస్సార్‌సీపీ హయాంలో అడుగడుగునా సంక్షేమం పరవళ్లు తొక్కుతోంది.. గడపగడపన సంతోషం వెల్లివిరుస్తోంది. రోజుకో పథకంతో.. ప్రతి ఇంటా కాసులు కురుస్తున్నాయి. సమాజం నుంచి పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ఐదేళ్లలో అనేక పథకాలకు అంకురార్పణ చేసింది. ఇందులో భాగంగానే 'ఈబీసీ నేస్తం' పథకాన్ని అమలు చేస్తోంది. మూడవ విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం బనగానపల్లెలో జరిగే సభలో బటన్ నొక్కి నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు.



- నేడు మూడో విడత వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధుల విడుదల
- ఏడాదికి ఒకరికి రూ.15 వేలు
- మూడు విడతల్లో రూ.45 వేలు లబ్ధి
- జిల్లాలో 34,145 మందికి ప్రయోజనం

జిల్లాలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం వివరాలు

సంవత్సరం	విడతల వారీగా	లబ్ధిదారులు	చెల్లింపులు (రూ.లక్షల్లో)
2021–22	మొదటిది	31,535	4730.25
2022–23	రెండవ	33,087	4963.05
2023–24	మూడవ	34,145	5121.75
మొత్తం		98,767	14,815.05

కడప రూరల్: వైఎస్సార్ ఈబీసీ నేస్తం.. అగ్రవర్ణాల్లోని మహిళలకు వరంగా మారింది. ప్రభుత్వం అందించనున్న ఈ నిధుల ద్వారా అగ్రవర్ణాల్లోని పేద మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారు. ఈబీసీ నేస్తం పథకం పట్ల వారంతా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

2022లో ఈబీసీ నేస్తానికి శ్రీకారం...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈబీసీ నేస్తం పథకాన్ని 2022 జనవరి 25న నిధుల విడుదల చేసి పథకానికి శ్రీకారం చుట్టారు. అనంతరం రెండవ విడతగా 2023 ఏప్రిల్ 12వ తేదిన నిదులను విడుదల చేశారు. తాజాగా ఈనెల 14న లబ్ధిదారుల ఖాతాల్లో నిధులను జమ చేయనున్నారు. ఈబీసీ వర్గాల్లోని 45 ఏళ్ల దాటి 60 ఏళ్లలోపు మహిళలు అర్హులు.

మూడు విడతల్లో రూ.14,815.05 కోట్లు లబ్ధి

వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద మూడవ విడతగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 34,145 మంది లబ్ధిదారులు రూ. 5121.75 లక్షలు పొందనున్నారు. కాగా, మొత్తం మూడు విడతలకుగాను ఒక్కొక్కరికి రూ.45 వేలు చొప్పున మొత్తం 98,767 మంది లబ్ధిదారులకు రూ.14,815.05 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది. లబ్ధిదారులంతా వైఎస్సార్ ఈబీసీ నేస్తంతోపాటు వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, బ్యాంకుల అనుసంధానంతో రుణాలు పొందడం ద్వారా ఫ్యాన్సీ స్టోర్లు, చీరల వ్యాపారం, పాల వ్యాపారం తదితర జీవనోపాధులను పెంపొందించుకున్నారు. తద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారు. పేదలు ఏ వర్గంలో ఉన్నప్పటికీ వారందరికీ ప్రభుత్వం ఆర్థికంగా సంపూర్ణ సహాయ సహకారాలు అందించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



ప్రభుత్వం పేద మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద గురువారం మూడో విడత నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. -జయసింహా, ఈడీ, జిల్లా బీసీ కార్పొరేషన్

ఉద్యోగుల సంక్షేమం కోరే ప్రభుత్వం



శివారెడ్డి,పురుషోత్తంనాయుడులను సన్మానిస్తున్న ఎన్జీఓ అసోషియేషన్ నేతలు

కడప రూరల్ : ఇది ఉద్యోగుల సంక్షేమం కోరే ప్రభుత్వమని ప్రభుత్వ సలహాదారులు యస్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ పురుషోత్తంనాయుడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు బీ శ్రీనివాసులు, కార్యదర్శి డీ రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం కడపలోని జెడ్పీ మీటింగ్ హాల్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ సలహాదారులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన బకాయిలు ఇతర అంశాలు నెలాఖరుకల్లా పరిష్కారం అవుతాయని తెలిపారు. ఉద్యోగుల అభ్యున్నతికి పాటు పడే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉద్యోగులంతా అండగా నిలవాలని కోరారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఆర్థికపరమైన అంశాలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా, ఉద్యోగుల సంక్షేమ పాలనను సాగించడం అభినందనీయమన్నారు. ఈ ప్రభుత్వానికి ఉద్యోగులంతా మద్దతుగా నిలవాలన్నారు. సన్మాన గ్రహీత ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుల కేవీ శివారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం శివారెడ్డి, పురుషోత్తంనాయుడులను సన్మానించారు. అంతకుముందు కోలాటాల మధ్య ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహ అధ్యక్షులు దస్తగిరిరెడ్డి, ఉపాధ్యక్షులు వై ప్రసాద్‌యాదవ్, రంగారావు, జగదీష్, ఇతర జిల్లాల అధ్యక్షులు, సభ్యులు జడ్పీ రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి



నక్కలదిన్నెలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్

చాపాడు : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం, సిబ్బంది సన్నద్ధం కావాలని..ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ అన్నారు. స్థానిక సీబీఐటీ కాలేజీలో బుధవారం మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల నేపథ్యంలో రెండో దశ వర్క్‌షాపు(శిక్షణ కార్యక్రమం) నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యచరణ, ప్రణాళికపై జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికలలో నేరాలకు పాల్పడ్డ వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజలు ఎలాంటి భయాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ అన్నారు. చాపాడు మండలంలో సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన నక్కలదిన్నె, కుచ్చుపాప గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. డీఎస్పీ వెంకటేశులు, సీఐలు శ్రీనాథరెడ్డి, మస్తాన్, చాపాడు ఎస్‌ఐ ఆర్ వీ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే ఫ్లాగ్‌మార్చ్

కడప అర్బన్ : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు, శాంతిభద్రతల పరిరక్షణ కోసం కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు జెండా కవాతు(ఫ్లాగ్‌మార్చ్) నిర్వహించారని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ఓటర్లను ప్రలోభపెడితే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభపెడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ తెలిపారు. ఎన్నికల్లో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై ప్రొద్దుటూరులోని ఐఎంఎ హాల్‌లో నియోజకవర్గ పోలీసు అధికారులు, సిబ్బందికి బుధవారం రెండో దశ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒకటి, రెండు రోజుల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుందని, అధికారులు, సిబ్బంది ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు

మైదుకూరు : ఎన్నికల పోలింగ్ రోజున ఎవరైనా సమస్యలు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అన్నారు. బుధవారం మైదుకూరులోని మూలబాట వీధిలో ఉన్న పోలింగ్ స్టేషన్ 87ను ఆయన పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లతో ఎస్పీ మాట్లాడారు. పోలింగ్ సరళికి అంతరాయం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నట్టు అనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, 5 నిమిషాల్లో చేరుకుని చర్యలు తీసుకుంటామన్నారు. మైదుకూరు డీ ఎస్పీ వెంకటేశులు, సీఐలు మస్తాన్, శ్రీనాథ్‌రెడ్డి, అర్బన్ ఎస్‌ఐ ఘన మద్దిలేటి పాల్గొన్నారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల నెరవేరింది



మాది రైల్వేకోడూరు మండలం రాజీవ్ గిరిజన కాలనీ, మేము ఎంతో కాలంగా పూరింటిలో నివాసం ఉంటున్నాం. ఎండకు, వానకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్నాం. ప్రభుత్వం 1.5 సెంటు స్థలం ఇచ్చింది. అందులో ఇళ్లు నిర్మించుకోవడానికి 1.80 వేలు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల సొంతింటి కల నెరవేరింది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – నిడిగింటి లీలావతి, రాజీవ్‌గిరిజన కాలనీ, కోడూరు.

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



ఒక్కరూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వలంటీర్ ద్వారా తీసుకున్నా. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. అయినా సకాలంలో వచ్చేవి కావు. జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకుంటే స్థానిక సచివాలయంలోనే దొరుకుతున్నాయి. అంతేకాకుండా డిగ్రీ చదువుతున్న నాకు జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన అందుకోవడం జరిగింది. ఇంత మంచి పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణపడి ఉంటాం. – మిరియాలవీరభద్రుడు, కాలువపల్లె, గోపవరం మండలం

జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు జిల్లా విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న చిత్తూరు డీఈఓ దేవరాజ్ తదితరులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

విద్యార్థిపేరు	ప్రాజెక్టుపేరు
బొగ్గు విజిత్ అభిలాష్	ఫ్రూట్ ఐడెంటిఫైర్ (నాగార్జున మోడల్‌స్కూల్, కడప)
షేక్ ఆసిఫా	అలారం టు ప్రొటెక్ట్ లైఫ్ అండ్ లింబ్స్ (ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, ప్రొద్దుటూరు)
మాచలముల రుగ్వేదవర్మ	ఐఓటీ స్మార్ట్ మిర్రర్ విత్ న్యూస్ అండ్ టెంపరేచర్ (ఏపీబీసీడబ్ల్యుఆర్ఈఐఎస్, కమలాపురం)
హితేష్ జైన్	విజన్ అలెర్ట్ ఫార్ స్టూడెంట్స్ (నాగార్జున మోడల్‌స్కూల్, కడప)

వైవీయూ : జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్–2024కు వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా పలమనేరులో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఇన్‌స్పైర్ మనక్–24 రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న విద్యార్థులు రాణించారు. రాష్ట్రస్థాయిలో 365 ప్రాజెక్టులు పోటీపడగా, చివరగా 24 ప్రాజెక్టులను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు నిపుణుల బృందం ఎంపిక చేసింది. ఇందులో వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు చోటు దక్కించుకున్నారు. వీరికి చిత్తూరు డీఈఓ దేవరాజ్ జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వై. రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఎం. అనూరాధ, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్లను అభినందించారు. జాతీయస్థాయిలో చక్కటి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

ఏప్రిల్‌లో వైవీయూ స్నాతకోత్సవం

ఈనెల 21 వరకు దరఖాస్తుల స్వీకరణ

వైవీయూ : యోగివేమన విద్యాలయం స్నాతకోత్సవం నిర్వహణకు సిద్ధమవుతున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ వెల్లడించారు. ఇందులో భాగంగా బుధవారం రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వర్‌రెడ్డితో కలిసి విశ్వవిద్యాలయంలో వేదిక నిర్మాణానికి అనువైన స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యోగివేమన విశ్వవిద్యాలయం 11, 12, 13వ కాన్వకేషన్ (2020–21, 2021–22, 2022–23) ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 2023 విద్యా సంవత్సరానికి ముందు ఉత్తీర్ణులైన విద్యార్థులు స్నాతకోత్సవ వేడుకలో పట్టాలు పొందేందుకు ఈనెల 21వ తేదీలోపు ఆన్‌లైన్‌లో కాన్వొకేషన్.వైవీయూఎగ్జామ్స్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయ పీజీ విద్యార్థులు, వైవీయూ అనుబంధ కళాశాలలో 2023కి ముందు పీజీ, డిగ్రీ, బీఈడీ, ఎంఈడీ, బీటెక్, లా ఉత్తీర్ణులైన వారందరూ కాన్వొకేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీహెచ్‌డీ అవార్డు అయిన వారు ఆఫ్‌లైన్‌లో (నేరుగా వచ్చి) దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు సమయంలో సందేహ నివృత్తి కోసం హెల్ప్‌లైన్ సెంటర్ (9705812613)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాన్వొకేషన్ విజయవంతం చేసేందుకు పది కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. 43 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ విభాగ డీన్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య డి. విజయ రాఘవ ప్రసాద్, ఎంబీఏ ఆచార్య వై సుబ్బరాయుడు, ఇంజినీర్ రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఆలయాలకు మహర్దశ



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు

సంబేపల్లె : జగన్న పాలనలో ఆలయాలకు మహర్దశ కల్గిందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయ రామరాజు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలు అన్నారు. బుధవారం జరిగిన సంబేపల్లె మండలం, శెట్టిపల్లె పెద్దబిడికిలో రూ.25 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా జరిగిన పూజలలో కార్మిక శాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్ లాల్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గొర్ల ఉపేంద్ర రెడ్డి, గొర్ల రమేష్ రెడ్డి తదితరులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి, నాయకులకు జిల్లా దేవదాయశాఖ శాఖ అధికారి విశ్వనాథ్, సర్పంచ్ వెంకటరమణ నాయక్, గ్రామస్తుల ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఆలయాల నిర్మాణాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అపర శ్రీ కృష్ణ దేవరాయులుగా సీఎం జగన్ పేరొందారన్నారు. పెద్దబిడికిలోనే రూ. 26 లక్షలతో మారెమ్మ ఆలయ ప్రాకారం, ఫ్లోరింగ్ నిర్మాణాలను పూర్తి చేసినట్లు చెప్పారు. నేడు రూ. 25 లక్షల నిధులతో రామాలయ నిర్మాణం పూర్తయి, విగ్రహ ప్రతిష్ఠ జరగడం హర్షణీమని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా తిరుమల శ్రీవాణి ట్రస్టు ద్వారా 76 వేల ఆలయాలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

సరళమైన సాహిత్యం మొల్లమాంబ కవిత్వం

– జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్



కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : విలువలతో కూడిన జీవిత సారాంశాలను సరళమైన కవితా, సాహిత్య సంపుటిగా సమాజానికి అందించిన గొప్ప రచయిత్రి మొల్లమాంబ అని, ఆమె రచనలు అజరామరమని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ బ్రహ్మయ్య అధ్యక్షతన మొల్లమాంబ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఆర్వో గంగాధర్ గౌడ్ తోపాటు రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ విద్వాన్ గానుగపెంట హనుమంత రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకట సుబ్బయ్య, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతిలు హాజరై మొల్లమాంబ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ రామాయణ మహా గ్రంథాన్ని పలువురు వివిధ భాషలలో రచించారని, అయితే వాల్మీకీ లాంటి మహనీయులు రచించిన రామాయణ గ్రంథాలను ఆధారం చేసుకుని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగు బాషలో మొల్ల రామాయణాన్ని సరళంగా రాయడం గర్వించదగ్గ విషయమన్నారు. బీసీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ బ్రహ్మయ్య, సంస్కృత అధ్యాపకులు డాక్టర్ నాగేంద్రమ్మ, మొల్లా సాహితీ కమిటీ ఉపాధ్యక్షులు పి.మల్లయ్య, అష్టావధాని జగన్నాథ శాస్త్రి, వాల్మీకి సంఘ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులు, దూదేకుల సంఘం సభ్యులు ఖాదర్ బాషా, విశ్రాంత ఉద్యోగి గురుమూర్తి, బీసీ కులాల అధ్యక్షులు లింగమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయం!



రుణ సహాయ పత్రాలను అందజేస్తున్న అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : సమాజంలోని అణగారిన వర్గాలకు అన్ని రంగాల్లో సమున్నత స్థానంతోపాటు వారి అభ్యున్నతే లక్ష్యంగా పీఎం–సూరజ్ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక రుణ సాయం అందిస్తోందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతిలు సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా 'ప్రధాన మంత్రి సామాజిక్ ఉత్థాన్, రోజ్‌గార్ అధారిత్ జనకళ్యాణ్' (పీఎం–సూరజ్) జాతీయ పోర్టల్‌ను దేశ ప్రధాని నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా ప్రారంచారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుంచి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకట సుబ్బయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, స్త్రీనిధి ఏజీఎం రమణా రెడ్డి, ఎల్డీఎం దుర్గా ప్రసాద్ లు హాజరయ్యారు. ప్రధానమంత్రి వీసీ ముగిసిన అనంతరం వీసీ హాలులో కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎన్ఎస్ఎఫ్‌డీసీ స్త్రీనిధి రుణ మంజూరు ద్వారా 489 మందికి మంజూరైన రూ.2,92,12,180 ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందించారు. అలాగే నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ కింద మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్లను కూడా పంపిణీ చేశారు.

సామాజిక సేవలో ఆదర్శంగా నిలుస్తాం



టి.చదిపిరాళ్లలో ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సాయిరమేష్

కమలాపురం : తమ సంస్థ కేవలం వ్యాపార దృక్పథంలోనే కాకుండా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తామని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఓ. సాయిరమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని టి.చదిపిరాళ్లలో భారతి సిమెంట్, సీహెచ్ఎఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో సుందరంగా తీర్చిదిద్దిన రెండు ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం అంగన్వాడీ చిన్నారులతో ముచ్చటించారు. ఐసీడీఎస్ సిబ్బందితో మాట్లాడి వారు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చదిపిరాళ్లలో రెండు, పందిళ్లపల్లె, సుంకేసుల, వై.కోడూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో త్రాగునీరు, ఎలక్ట్రిసిటీ, ఫర్నీచర్, పెయింట్, బొమ్మలు, ఆట వస్తువులు సమకూర్చి ఆదర్శ అంగన్వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దామన్నారు. ఇలాంటి సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు పేర్ల భార్గవ్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, సీహెచ్ఎఫ్ ప్రతినిధి చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, షంషాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పూజారి

ఖాజీపేట : దేవుని సొమ్ములు దోచుకుని నమ్మకద్రోహానికి పాల్పడిన పూజారి పోలీసుల అదుపులో ఉన్నాడు.ఖాజీపేట టౌన్ సాయిబాబా ఆలయంలో ప్రసాద్ శర్మ ఆరు నెలలుగా పూజారిగా పనిచేస్తున్నారు. అయితే ఫిబ్రవరి 24 నుంచి ఆయన కనిపించలేదు.. దీంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి విచారించారు. పూజారి కనిపించాక ఆలయ కమిటీ సభ్యులు పరిశీలించగా ఆలయంలో విలువైన వెండి ఆభరణాలు పోయినట్లు గమనించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 8 లక్షల వెండి ఆభరణాలు పోయినట్లు కమిటీ సభ్యులు పోలీసుల దృష్టికి తీసుకు వచ్చారు. ఖాజీపేట సీఐ రామాంజులు ప్రత్యేక దృష్టి సారించి పూజారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసు విచారణలో వెండి ఆభరణాలు అపహరించినట్లు ఒప్పుకున్నారు. వాటిని ప్రొద్దుటూరులోని ఒక దుకాణంలో అమ్మినట్లు స్పష్టం చేశారు. దుకాణాదారుని పిలిపించి వెండి ఆభరణాలు రికవరీ చేసే పనిలో ఉన్నారు.

వైభవం..ధ్వజావరోహణం



వీరభద్రస్వామికి వసంతోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

రాయచోటిటౌన్ : శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఎంతో ధ్వజావరోహణం నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం జరిపారు. ఉదయం యాగశాలలో మహా పూర్ణాహుతి జరిపారు. ఉదయం 10–30 గంటలకు వేదపండితులు ప్రణవానంద గిరి (నర్రా వెంకట భాస్కర్ సిద్ధాంతి) ఆధ్వర్యంలో ఉదయం యాగశాలలో రుత్వికులు యజ్ఞం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు సమర్పించిన పట్టువస్త్రాలను మహాపూర్ణాహుతిగా ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలం రెడ్డి దశరథరామిరెడ్డి చేతుల మీదుగా యజ్ఞంలో సమర్పించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం కట్టుబడిగా (కట్టబడిన కంకణాలు) భక్తజనులతో కలసి కంకణ విసర్జన కార్యక్రమాని నిర్వహించారు.చివర్లో గంధం, కుంకుమ, పసుపు కలిపిన నీళ్లతో వసంతోత్సవ కార్యక్రమం జరుపుకున్నారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల –కడప రైలు మార్గంలో వెళ్లే హుబ్లీ రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఓ ప్రయాణుకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎర్రగుంట్ల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజారామిరెడ్డి బుధవారం తెలిపారు. పూర్తి వివరాల కోసం విచారణ చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 55 ఉంటుందని తెలిపారు.